క్లుప్తంగా

31న పర్యావరణ పరిరక్షణపై పోటీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ' భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితి స్థాపకత', పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై ఈ నెల 31న విద్యార్థులకు వ్యాస రచన, ప్రసంగం, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని కోటిరెడ్డి రామసుబ్బమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ పోటీల్లో 6 నుండి 10 వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ విద్యార్థుల వరకు రెండు విభాగాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు వారి పేరు, విద్యా సంస్థ, తరగతి, ఫోన్ నెంబర్ తదితర వివరాలను 81794 54953 నెంబర్‌కు పంపాలని సూచించారు.

ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఆందోళన

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని పొద్దుటూరు పట్టణం ఎర్రగుంట్ల బైపాస్ మోడంపల్లిలో ప్రభుత్వ అనుమతి లేకుండా తరగతులను నిర్వహిస్తున్న ఫేస్ జూనియర్ కళాశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం ఆర్ఐఓ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఈ కళాశాలలో చేరిన విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గోపీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంగా జిల్లాలోని 163 మంది ఉపాధ్యాయులకు జారీ చేసిన ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) కోరింది. ఈ విషయమై మంగళవారం ఫ్యాప్టో జిల్లాశాఖ ఆధ్వర్యంలో డీఈఓ అనురాధను కలిసి వినతి పత్రాన్ని సమర్పించి విజ్ఞప్తి చేశారు. ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ మాదన విజయ్‌కుమార్ మాట్లాడుతూ 163 మంది ఉపాధ్యాయులతో పాటు ఎన్నికల శిక్షణా తరగతులకు హాజరు కాలేదని మరో 18 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారన్నారు. విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు తీవ్రమైన అనారోగ్య సమస్య కారణం చేత మాత్రమే ఎన్నికల విధులకు హాజరుకాలేక పోయారని వివరించారు. జిల్లా అధికారులు మానవతా దృక్పథంలో స్పందించాలని విజ్ఞప్తి చేశారు. తదుపరి చర్యలను నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకలు ఇలియాష్ బాష, ఖాదర్‌బాష, పాలెం మహేష్ బాబు, రాజశేఖర్, నరసింహారావు, సివిరమణ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి హనుమాన్ జయంతి మహోత్సవాలు

వేంపల్లె : స్థానిక పాపాఘ్నినది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి అనుసంధానమైన ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 31నుంచి హనుమాన్ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కురాకుల వెంకటేష్, అర్చకులు హరిప్రవీణ్‌లు తెలిపారు. 31వ తేదీన శుక్రవారం గణపతి పూజతో మొదలై ఆంజనేయస్వామి మూలవరులకు అభిషేకం, అలంకరణ ఆరాధన చేస్తారన్నారు. అనంతరం గణపతి హోమం, నవగ్రహ హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహిస్తారన్నారు. జూన్ 1వ తేదీ శనివారం ఉదయం సుప్రభాతం, దేవత ఆరాధన, కలిషారాధన, మూర్తి హోమం, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

డేగనవాండ్లపల్లెలో నాకాబందీ



ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ పురుషోత్తంరాజు

సిద్ధవటం : మండలంలోని డేగనవాండ్లపల్లెలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు మంగళవారం నాకాబందీ, కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామని ఒంటిమిట్ట ఎస్ఐ పురుషోత్తంరాజ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులు పటాసులు కాల్చడం చేయకూడదని గ్రామ ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే ఎటువంటి గొడవలకు పాల్పడవద్దని ఆయన హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులో ఉందని ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను పాటించాలని గ్రామాల్లో ఎవరైనా కక్షపూరితంగా గొడవలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం లక్ష్మి తులసి



మాట్లాడుతున్న బ్యాంకు ఆర్ఎం లక్ష్మి తులసి

కడప కోటిరెడ్డిసర్కిల్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందడం సంతోషదాయకంగా ఉందని బ్యాంకు రీజినల్ మేనేజర్ లక్ష్మి తులసి తెలిపారు. మంగళవారం కడప నగరం వైఎస్సార్ ఆడిటోరియంలో బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రీటైల్ ఎక్స్‌పోను ఆర్ఎం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తమ బ్యాంకు వ్యవసాయ, గృహ, వాహన, విద్య, సూక్ష్మ మధ్యతరగతి, పారిశ్రామిక రుణాలను అతి తక్కువ వడ్డీతో అందజేస్తోందన్నారు. రీటైల్ లోన్ ప్రాసెసింగ్ సెంటర్, ఎంఎస్ఎంఈ లోన్ పాయింట్ ద్వారా ఆయా రుణాలను త్వరితగతిన మంజూరు చేస్తున్నామన్నారు. యూనియన్ బ్యాంకు విదేశీ విద్యా రుణం కోటి 50 లక్షల రూపాయల వరకు అందజేస్తున్నామన్నారు. విద్యా రుణాలు ప్రీమియర్ అబ్రాడ్ యూనివర్శిటీలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రూ. 40 లక్షల వరకు ఎటువంటి తనఖా లేని రుణాలు మంజూరు చేస్తున్నామని, ఈ సదుపాయం యూనియన్ బ్యాంకులో మాత్రమే ఉందన్నారు. అనంతరం నగర ప్రముఖులు బండి పిచ్చిరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఎస్వీ రామ్మూర్తి, ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి బ్యాంకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల రుణ మంజూరు పత్రాలను ఖాతాదారులకు అందజేశారు. ఇదే సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యులు పాల్గొని తమ సేవలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు రాజ్ కుమార్, షేక్ బాష, చీఫ్ మేనేజర్లు, కడపశాఖల మేనేజర్లు, రీజినల్ కార్యాలయ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవంలో రాయలసీమ వాసులకు డాక్టరేట్ పరిశీలించాలి

వైవీయూ : త్వరలో యోగివేమన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయం ప్రదానం చేసే గౌరవ డాక్టరేట్‌కు రాయలసీమ వాసులను పరిగణలోకి తీసుకోవాలని జానుమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానుమద్ది విజయభాస్కర్ కోరారు. ఆయన వైవీయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు డాక్టరేట్ ప్రదానంపై లేఖరాశారు. స్నాతకోత్సవంలో వైఎస్ఆర్ కడప జిల్లావారు, రాయలసీమ ప్రాంతానికి చెందిన గొప్ప వారు ఎందరో ఉన్నారని, వారిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అదే విధంగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని గవర్నర్ సందర్శించేలా చూడటం, నూతన భవన నిర్మాణం తదితర అంశాలపై సహకారం అందించాలని లేఖలో కోరారు.

ఇంటాక్‌తో జిల్లా వారసత్వ రక్షణపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : జిల్లాలోని అపురూప వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగంగా విస్తృతంగా ప్రచారం కల్పించనున్నట్లు భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి అన్నారు. ఇంటాక్ బాధ్యతలను చేపట్టి సంవత్సరం గడిచిన సందర్భంగా మంగళవారం స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్లో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సంస్థ చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. మన చరిత్ర పేరిట జిల్లా వారసత్వ సంచికను తీసుకు రానున్నట్లు తెలిపారు. పాత కలెక్టరేట్‌ను శిథిలం కాకుండా కాపాడేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో జిల్లాలోని 120 పైగా పర్యాటక చారిత్రక వారసత్వ ప్రదేశాలతో ప్రత్యేకంగా దర్శిని పేరిట వారసత్వ సంచిక తీసుకురానున్నామని, కడప ఇంటాక్ కోసం యూట్యూబ్ ఛానల్ నిర్వహించే ఆలోచన ఉందన్నారు. వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మన చరిత్ర జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్, వైవీయూ విశ్రాంత ప్రిన్సిపల్ జి. సాంబశివారెడ్డి, సంస్థ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, పూర్వ కో కన్వీనర్ వేణుగోపాల్‌లు కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో కొండూరు జనార్ధన రాజు, డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, యం.రాణి, వెల్లాల వెంకటేశ్వరాచారి, జ్యోజి రెడ్డి, సంజీవరెడ్డి, రాఘవేంద్ర వర్మ, కల్లూరు బాల ఎల్లా రెడ్డి, ఎ. వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

• కమనీయం.. కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో వెలసిన శ్రీ గోదా, మహాలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ చతుర్థ వార్షికోత్సవ, బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ గోదా మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. రెండు రోజు లు పాటు ఆలయంలో సుప్రభాత సేవతో పా టు వివిధ రకాల, అభిషేకాలు, హోమాలు జరిగాయి. శ్రీవారి కల్యాణం అనంతరం సాయంత్రం గ్రామోత్సవంను వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గజవాహనంపై చెన్నకేశవుడు



గజవాహనంపై శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున చెన్నకేశవస్వామి, మహాలక్ష్మీదేవిల మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో అలంకరించారు. సాయంత్రం స్వామివారిని గజవాహనంపై శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను పురవీధుల్లో గోవింద నామ స్మరణల మధ్య ఘనంగా ఊరేగించారు. దారివెంబడి భక్తులు కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కాగా బుధవారం ఉదయం చెన్నకేశవస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

కడప యువకుడికి అరుదైన శస్త్రచికిత్స

సాక్షి, హైదరాబాద్ : కిడ్నీ మార్పిడి చేయించుకున్న వ్యక్తిలో అరుదైన కణితిని విజయవంతంగా తొలగించామని బంజారాహిల్స్ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆసుపత్రి వైద్యులు రాజేష్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప పట్టణానికి చెందిన 39 ఏళ్లయువకుడికి ఎడమ వైపు వృషణం వాపు వచ్చింది. దాన్ని సాధారణ హైడ్రోసెల్‌గా భావించాడు. అయితే వాపు క్రమంగా పెరగడంతో వైద్యుల సూచనల మేరకు ఏఐఎన్‌యూలో చేరాడు. పరీక్షలు నిర్వహించగా ఎడమవైపు వృషణం నుంచి బొడ్డు మీదుగా ఉదరభాగం వరకు డంబెల్ ఆకారంలో పెద్దకణితి ఉన్నట్లు తేలింది. దీంతో శస్త్ర చికిత్స చేసి కణితిని తొలగించామని రాజేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. యుక్త వయసులో వృషణాల్లో కణితులు సాధారణమేనని, అవి ఇంత పెద్దగా పెరిగి ఉదర భాగం వరకు వెళ్లడం అరుదని ఆయన తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో ఆసుపత్రి వర్గాలు శుభాకాంక్షలు తెలిపాయన్నారు.

నేడు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఉంటుందని ఎంఈవోలు చౌడయ్య, శివజ్యోతి తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఏ విధంగా తయారు చే యాలనే విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. అందరూ తప్పక హాజరు కావాలన్నారు.

30న ఆలయ భూముల కౌలు వేలం

సిద్ధవటం : మండలంలోని వెంకటాయపల్లె గ్రామంలో వెలసిన శ్రీ అంబాపుర పార్థీశ్వర స్వామి ఆలయ భూములను కౌలుకు ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాయపల్లెలోని దేవస్థానం ఆవరణలో వేలం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటాదారుడు రూ.1000 డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్న వారు వెంటనే ఒక సంవత్సరం మునిగుత్తను చెల్లించి రశీదు పొందాలన్నారు. దేవస్థానానికి ముందు బాకీ ఉన్న వారు బాకీని చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. దేవస్థా నం భూములు వెంకటాయపల్లె గ్రామంలో సర్వే నెంబర్ 296లో 1.37 ఎకరాలు, 254లో 2 ఎకరాలు, పొన్నవోలు కొత్తపల్లెలో సర్వేనెంబర్ 137 లో 1.82 ఎకరాలు, వెంకటాయపల్లెలో 389/1లో 0.64 సెంట్లు, 228/3లో 0.56 సెంట్లు, 254లో 1.84 ఎకరాలు, పొన్నవోలు కొత్తపల్లెలో 190/2లో 1.12 ఎకరాలు, వెంకటాయపల్లెలో 250/2లో 0.24 సెంట్లు, 343/3లో 0.47 సెంట్లు, 210లో 0.37సెంట్లు, 106/1లో 0.93 సెంట్లు, 108/2లో 0.68 సెంట్లు, కడపాయపల్లెలో సర్వే నెంబర్ 39/2లో0.72 సెంట్లు భూములు ఉన్నాయన్నారు.

రుతుక్రమంపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, బాలికలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : యుక్త వయస్సులో వచ్చే మార్పులతోపాటు రుతుక్రమంపై బాలికలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ రియాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రతా దినోత్సవ సందర్భంగా ఎర్రముక్కపల్లె పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహించి బాలికలకు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ యుక్త వయసు బాలికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేకంగా నెలసరి శుభ్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. రుతుక్రమం ఒక సహజ ప్రక్రియ అని, దీనిపై బాలికలు, మహిళలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు.

నెలసరి సమయంలో వచ్చే కడుపునొప్పికి వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని సూచించారు. నెలవారి సమయంలో విశ్రాంతితో పాటు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఇది శరీరంలో రక్తహీనతను నివారిస్తుందన్నారు. దేశంలోని మహిళల్లో రక్తహీనత సమస్య అధికంగా ఉందని తెలిపారు. అనంతరం సెక్టార్ సూపర్‌వైజర్ రేణుక రక్తహీనత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, తల్లులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించడమే లక్ష్యం



వంటల పోటీలలో బహుమతులను సాధించిన వారితో ఎంఈఓలు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి ఒక్క విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యమని కడప మండల ఎంఈఓలు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్‌లు సూచించారు. మంగళవారం కడపలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన కుక్ కం హెల్పర్(సిసిహెచ్)లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంతోపాటు కుక్ కం హెల్పర్లకు కుకింగ్ కాంపిటీషన్ మున్సిపల్ హైస్కూల్ మెయిన్ హెచ్ఎం నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో విజేతలైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించిన, కేటాయించిన మెను ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు పోషకకరమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు. అలాగే వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పరిశుభ్రమైన పదార్థాలతో వంటను వండి విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన సీసీహెచ్‌ల ద్వారా తమ అనుభవాలను పంచుకున్నారు. స్ట్రాంగ్ టీచర్, మాస్టర్ ట్రైనర్ రమేష్, శివారెడ్డిలు ఎండీఎం సీసీహెచ్‌లకు శిక్షణను ఇచ్చారు. అనంతరం సీసీహెచ్ ఆరు విభాగాలుగా విభజించి రోజుకొకరు చొప్పున సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజుల మెనుపై వంటల పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన సీసీహెచ్‌లకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కడప మండలంలోని హెడ్మాస్టర్లు, సీఆర్‌పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి, కంపెనీ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చదువుతున్న చివరి సంవత్సర విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి మంగళవారం కళాశాల ఆవరణంలో ఆఫర్ లెటర్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న డీసీఈ, డీసీఎంఈ, డీఈసీఈ, డీఈఈఈ, డీపీహెచ్ బ్రాంచులకు చెందిన 89 మంది విద్యార్థులు 14 రకాలకు చెందిన వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో సంవత్సరానికి రూ.1.62 లక్షల నుంచి రూ.7.8 లక్షల ప్యాకేజీ వరకు వేతన ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వీరందరికీ కళాశాల ఆవరణంలో ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో వారికి ఆఫర్ లెటర్స్ అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి మాట్లాడుతూ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కొన్ని కంపెనీలు ఆన్‌లైన్‌లో, మరి కొన్ని కంపెనీలు క్యాంపస్‌కు వచ్చి ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించాయన్నారు. ఈ ప్లేస్‌మెంట్‌లో మా కళాశాల నుంచి 89 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఇందులో కొంతమంది విద్యార్థులు రెండు మూడు కంపెనీలకు కూడా ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారంతా ఉద్యోగాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, కంపెనీ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు


కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 27వ తేదీ నుంచి జరుగుతున్న సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని రెండోరోజు మంగళవారం అమ్మవారి మూల విగ్రహాలకు విశేష పంచామృత అభిషేకములు, మహాలక్ష్మీ, మహా సరస్వతి, నవగ్రహ మహా గణపతి పూజ, అభిషేకములు, అవాహిత హోమములు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం ప్రదోశకాల పూజలు, పంచ అష్టోత్తరము, అమ్మవారికి కుంకుమార్చనలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కాగా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

ఏడు దాటితే అనుమతించం

రాజకీయ పార్టీల నేతల సమావేశంలో జేసీ గణేష్‌కుమార్



మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్



హాజరైన రాజకీయ పార్టీల నాయకులు

కమలాపురం : జూన్ 4న సాధారణ ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి ఏజెంట్లు ఉదయం 7 గంటలలోపే చేరుకోవాలని, ఏడు దాటితే లోనికి అనుమతించమని ఆర్ఓ గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జూన్ 4న కడపలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ యూనివర్శిటీలో జరిగే కౌంటింగ్ గురించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీ నిబంధనల మేరకే కౌంటింగ్ జరుగుతుందని, ఎవరూ అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఒక్కో టేబుల్‌కు 5 మంది ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం గదులు చాలా ఇరుకుగా ఉన్నాయన్నారు. అందుకు కేవలం 5 మందిని మాత్రమే అనుమతిస్తామన్నారు. పార్లమెంటు కౌంటింగ్ కేంద్రం పెద్దదిగా ఉండటంతో టేబుల్‌కు 9 మందిని అనుమతిస్తామన్నారు. 7 గంటల్లోపే ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని 7 దాటితే లోపలికి అనుమతించమన్నారు. 8 గంటలకు ఏజెంట్ల ముందే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభిస్తామని, 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభిస్తామన్నారు. ఏజెంట్లను లాటరీలో వచ్చిన విధంగా టేబుళ్ల వద్ద కూర్చోబెడతామన్నారు. ఇందులో ఏలాంటి దాపరికం, ఏలాంటి అపోహలు లేకుండా నిష్పక్షపాతంగా కౌంటింగ్ చేపడతామన్నారు. ఈవీఎంలు పనిచేయకపోతే బ్యాటరీలు మారుస్తామని, అప్పటికి పని చేయకపోతే వీవీ ప్యాట్‌ను కౌంట్ చేస్తామన్నారు. ఎవరూ ఎలాంటి గాబరా పడాల్సిన అవసరం లేదన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించబోమని, సీక్రెట్ కెమెరాలు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్‌లో ఎవైన అనుమానం వస్తే తక్షణం చెప్పాలని, పూర్తి అయ్యాక చెబితే మరలా కౌంటింగ్ చేయాలంటే చాలా కష్టమైన పని అన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులు సహకరిస్తే కౌంటింగ్ సజావుగా సాగుతుందన్నారు. ఏఆర్ఓ సుబ్రహ్మణ్యం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.